మంచం

జంపన పెద్దిరాజు

"ఎంతైనా మొగుడుకదరా। అది అట్టాగే అంటుఁదిలే— నువ్వు— ఫో రేపో బస్తా గింజలు కొలిపిస్తానని చెప్పు. ఈ పాతికతీసుకో. ఇరవై దానికియ్యి. మొత్తం నువ్వు కొట్టెయ్యకు. డొక్క చీల్చేస్తా। ఏటిగట్టుపాకలోకి రమ్మను"

డబ్బుచేతిలో పడిందంటే చాలు. సుబ్బడు సరస్వతిని తార్చమంటే తార్చేరకం. అందుకనే వాడికి ఇంటిపేరులేకుండా పోయింది. తార్పుడు సుబ్బడంటే తూర్పుపేట నుండి తుమ్మక్క మేడదాక అదోరకం "ఇనుఫ్లెన్సు." తుమ్మక్క అంటే ఎవరోకాదు. తుంగభద్రయ్యగార్ని రోజూ మజాకాచేసే సింగారి. సింగారిమేడ నిజంగా మేడకాదు. దూళ్ళపాకలో సిమ్మెంటుగది. ఊళ్లోవాళ్ళంతా పెట్టిన "నిక్‌నేమ్" లాటిది అ తుమ్మక్క మేడ.

ఆ మేడలో వారానికొక కోడిని తింటారు తుంగభద్రయ్యగారు. కోడితోపాటు కోటయ్య తెచ్చిన నాటుసారా సేవిస్తారు— కాదు సేవించేవారు.

ఇక కోటయ్యచేత్తో సచ్చుమంచినీళ్ళుకూడా ముట్టరు, ఇంత గొడవ జరిగిన తర్వాత కోటయ్యకు తనకు సంధిపొసగటం అసంభవం. కోటయ్య కొంప ఖాళీచేయాల్సిందే. ఏదో కావేటి మొహం చూసి— ఛ—కాదు— దాని వొళ్ళుచూసి ఇన్నాళ్లు ఆగారు కాని లేపోతే పెధవని కోటయ్యని ఆరోజే వోటు హక్కులేకుండా వూరినుండి తరిఁవేసేవారు.

అసలింతకూ కావేటి ఎవరోకాదు. కోటయ్య పెళ్లాం. తార్పుల సుబ్బడు న్యాయంగా ఇస్తే ఇరవైరూపాయలు చేరవలసిన గమ్యం. క్లుప్తంగా చెప్పాలంటే భద్రయ్యగారికి చిరుతిండి. మామూలు పరిస్థితుల్లో అయితే నిజానికి తుంగభద్రయ్యగారు తార్పుడు సుబ్బడిచేత కావేటికి కబురు పంపక్కర్లేదు.

అలా— గరువుమీద గానుగెదులా పాకదగ్గర తడకవద్ద కొంచెంసేపు తచ్చాడితే చాలు. ఈలోపు కావేటి చెంబుతో తిన్నగా తప్పదన్నట్టుగా చెఱుకుతోటలోకి వెళ్తుంది

1028

తుంగభద్రయ్యగారు మనుషులందరికీ పనులు పురమాయించి కొంచెంసేపటికి చెఱుకు తోటలోకి వెడతారు.

అంతే— మళ్లా ఈలోపు రకరకాల తిళ్లతిని ఎప్పుడో కావేటికి పునర్దర్శనం.

దాంతో కావేటికి ఒక అరబస్తా పిడకలో (అవీ కావేటి చేసినవే), అయిదు పదలాలు బెల్లమో, వాళ్లావిడకు తెలియకుండా అరజాడీ ఆవకాయో! అంతగా ఎప్పు డన్నా మరీ గోలపెడితే అయిదో పదో—

ఇవేవీ కావేటికి నిజంగా కూడెడుతున్నాయా అంటే— 'లేదు'— అని కావేటి ఖచ్చితంగా చెప్పగలదు. ఐతే మరి 'భద్రయ్య చేతిలో కావేటి కాలెందుకు జారింది' దానికి మొదట్లో కావేటికి అంతుదొరకలేదు కాని తర్వాత తర్వాత తెలిసిపోయింది.

అసలు కావేటేగనక విద్యావేత్తయితే "దారిద్ర్యానికి ధనంపైమోజు. థర్డ్‌క్లాస్ టిక్కెట్టుకు ఫస్టుక్లాస్‌పైమోజు. సైకిలుకు కారుపైమోజు. కారుకు ప్లెయినుపైమోజు, పూరిగుడిసెకు ఆరంతస్తుల మేడపైమోజు— ఈమోజే తనకాలు తుంగభద్రయ్య చేతిలో జారేటట్టు చేసిందని చెప్పి ఉండేది. కాని కావేటి చదువుకొన్నది కాదుగా—

కోటయ్య పెళ్ళం.

"పాలేరు కోటయ్య పెళ్లాం"

ఈమాటే కావేటి మొగుడుదగ్గిర కొచ్చిన కొత్తలో ఊరందరి నోట్లోనూ పిప్పర మెంటులా చప్పరింపబడేది.

కావేటి కాణప్పగారి చెర్లోంచి నీరట్టుకొస్తుంటే కుర్రాళ్ళ దగ్గరనుంచి ముసలాళ్ల దాక కావేటిని కళ్ళతో తాగేసేవారు. కావేటి బిందె నెత్తిమీదపెట్టుకొని కుడిచేత్తో బిందట్టు కుంటే ఊరంతా రోడ్డుకు కుడిపక్కగా నడిచేది— ఎడంచేత్తో బిందట్టుకుంటే ఊరంతా రోడ్డుకు ఎడంపక్కగా నడిచేది. కావేటికున్న నాలుగుచీరల్లో ఏ చీరకట్టినా ఆ చీరకు అందం వచ్చేది. కొత్తగా కాలవలోకి నీరు పాకినట్టుగా కావేటి వొంపుసొంపులపై చీర అతుక్కుపోయేది. కోటయ్యమాత్రం కొత్తలో కాయకష్టం లోంచొచ్చిన చెమటపెట్టి చీరలు కొనేసేవాడు. అందుకనేనేమో, కావేటి చీరలంత బావుండేవి!

ఊళ్లో వాళ్ళలాగే కొత్తలో కావేటి శరీరాన్ని మాత్రమేచూసి మురిసిపోయేవాడు కోటయ్య. కాని తర్వాత తర్వాత కావేటి రక్తమాంసాల వెనక ఏదో బంధంకనిపించేది.

1029

అలాటి వయసులో ఉన్న కావేటి వయసులతో ఆడుకొనే తుంగభద్రయ్య చేతిలోంచి తప్పించుకోలేక పోయింది. తుంగభద్రయ్యకు వయసుమళ్లని రోజులవి. అప్పట్లో తుంగభద్రయ్య సరదాగా గుర్రాన్నొకదాన్ని కొన్నాడు. ఊళ్ళో నాలుగైదు సార్లు రోజూ షికారుకు తిరిగేవాడు. భద్రయ్య గుర్రానికి చాలపొగరనేవాళ్ళు ఊళ్ళో వాళ్లు– భద్రయ్య పెళ్లానికూ్కడ– భద్రయ్య భార్యమాటల్లో ఎంతోగర్వం తొణికిసలాడేది. నడకలో చాల ఠీవిచూపించేది. ఆవిడ ఠీవిగురించి ఊరంతా రకరకాలుగా చెప్పుకొనేవారు.

"నాకు ఠీవిగల ఆడదంటే మాచెడ్డకసి" అనేవాడు కోటయ్య. ఈ మాటిన్నప్పుడల్లా కావేటికి భద్రయ్య భార్యను చూడాలనిపించేది.

ఓసారి భద్రయ్యగారింట్లో ముసలమ్మ చచ్చిపోతే ఊళ్ళోవాళ్లందరికీ పప్పూ పులుసుతో సంతర్పణ పెట్టించాడు. ఆ సందర్భంలో ఏదోపనుందని పాలేరు పెళ్లాం కావేటికి భద్రయ్య పెళ్లాం కబురంపింది..

అప్పుడే కావేటి భద్రయ్య ఇంటిని, భద్రయ్య పెళ్లాన్నిచూసింది. పనిచేసుకునే వాళ్ళు చూడవలసినంత దూరాన్నుండే చూసింది. భద్రయ్య పెళ్లాంకంటే భద్రయ్య పెళ్లాం పెట్టుకున్న నగలు నచ్చాయికావేటికి– అసలాయింట్లో భద్రయ్యకంటె, భద్రయ్య పెళ్లాంకంటే ఆ ఇంటి పడగ్గది నచ్చింది.

"అమ్మగోరూ, ఒక్కసారి గది సూత్తానండి" అంది కావేటి ఉండబట్టలేక.

భద్రయ్య పెళ్లాం ముందు మొహం చిట్లించింది. "సరే, జాగ్రత్తగా చూడు. కాళ్ళుతుడుచుకు లోపలికెళ్ళు'' అంది.

జాగర్త అనేపదం కావేటికి అనవసరం అనిపించింది. కాళ్లుకడుక్కొని చీర కొంగుతో కాళ్ల తుడిచేసుకుంది.

కావేటి గుమ్మంలోపల అడుగెట్టిందో లేదో– పనిపిల్లకామోసు కాపలా కుక్కలా గుమ్మందగ్గర నిలబడి కావేటిని చూస్తోంది. కావేటి గదిలో వస్తువులపేర్లు ఒక్కొకటి అడిగింది.

గది సుమారు కావేటి ఉంటున్న దూళ్లపాకలో మూడోవొంతుంటుంది. పేద్ద బొమ్మిగేదెల్లా గదిలో రెండు మంచాలు. వాటిపై పులిచార్లతో ఉన్నవెడల్పాటి దుప్పట్లు,

1030

మల్లెపూలాంటి దోమతెర ముసుగు. గదంతా పచ్చగడ్డి పరిచినట్టుగ పచ్చటికార్పెట్టు. దానిపై ఉమ్మెత్తపువ్వులాంటి పువ్వులు కార్పెట్‌పై నడుస్తుంటే కావేటికి కాళ్లలో చక్కిలిగింత పెట్టినట్టయింది. గదిచుట్టూ ఒడ్డేళ్ళ చాపలూ, గదిలోకెళ్లగానే బొడ్డులోతు నీళ్ళలో దిగినంత చల్లగా ఉంది. గోడకి నాలుగుప్రక్కలా నాలుగు కుండేళ్లలా తెల్లటి అందమైనదీపాలు— వాటికి చమురెక్కడ పోస్తారా। అని కావేటి కళ్లపెద్దవిచేసి చూసింది.

పక్కకి తిరిగిచూసి ఒక్కసారి ఉలిక్కిపడింది. తనెత్తు అద్దం కావేటి సిగ్గుపడిపోయింది. బుగ్గలమీద చొట్టలుచూసుకొని పక్కకు తిరిగిపోయింది. పైనున్న శృంగార చిత్రపటాలవేపు అలా చూస్తూండిపోయింది. అందులో కావేటికి పిల్లనగ్రోవి ఓచేత్తో పట్టుకొని రాధవీపు వెనకనుండి ఎడంచేతి క్రిందుగా రెండోచెయ్యి పోనిచ్చి నిల్చున్న కృష్ణుడు కనిపించేసరికి కావేటికి కోటయ్యగుర్తొచ్చి సిగ్గుపడిపోయింది. పనిపాపతో రేడియో పెట్టించుకొని కొంచెంసేపుంది. కావేటికి గదిలో ఉన్నంతసేపూ ఎక్కడో మంచుగుహలో ఉన్నట్టుంది. తనుంటున్న తడికల భవనం గుర్తొచ్చింది. తెగిపోయిన నులకమంచాలు కావేటిని వెక్కిరించినట్టయింది. కావేటి భదిర్య్య ఇంటిలో మంచాల వంక మరోసారి చూసింది. 'దీనిపైనే భద్రయ్య, భద్రయ్య పెళ్లాం పడుకుంటారు' అనుకుందో లేదో— తను, తనకోటయ్య ఆ మంచాలపై పడుకుంటే కావేటి ఆలోచించలేకపోయింది. ఆఖరుసారిగా గదిలో ముసుగుతో మూలనున్న ఇనప్పెట్టెవంక చూస్తూ బైటకువచ్చేసింది. అంతకంటే ఎక్కువసేపు అక్కడుంటే అమ్మగారిదగ్గరనుండి కేక వస్తుందని తెలుసు.

అంతే అదంతా కలలా జరిగిపోయింది. నిజంగా ఆరాత్రి కలొచ్చింది తనూ తుంగభద్రయ్య ఆ మంచంమీదున్నట్టు. కావేటి మరునాడు నీళ్లకెళ్ళేటప్పుడు తుంగభద్రయ్యను వింతగా చూసింది. ఏదో కొత్తగా కనిపించాడు. ఊళ్లోవాళ్ళంతా అంటారు "భదిర్య్య ఇల్లు చాలా బావుంటుందని" కావేటికి ముసుగు కప్పుకొన్న మంచాలు మళ్లీప్రత్యక్షమయాయి. వాటికి మనం తగం అనుకుంది. మరి తుంగభద్రయ్య దొంగ చూపులేంవిటి?

తుంగభదిర్య్య తొడుక్కున్న సిల్కు చొక్కలోంచి కనిపిస్తోన్న నోట్లకట్టవంక చూసింది. భదిర్య్య కావేటికి ఆకలిలా కనిపించాడు. భదిర్య్య కౌగిట్లో తనుంటే భద్రయ్య పెళ్ళాంతో తనకు సమానహోదా లభించినట్టుగా పొంగిపోయింది. అంతే-

1031

కావేటి కాలుజారింది తనింట్లోనే– తన నులకమంచంపైనే. కోటయ్య లేనప్పుడు భదిరియ్య కావేటిని మెత్తగా మత్తుగా నలిపాడు. కాని అతనిమంచంపై కాదు. అప్పుడు తెలిసింది కావేటికి– తను తుంగభదిరియ్య పెళ్లాంతో సమానం కానని. ఏదేమైతేం కావేటి మనసులో భద్రయ్యగది. భద్రయ్యగదిలో మంచాలు అలాగే ఉండిపోయాయి.

కావేటి భదిరియ్య మొహం వంకమళ్లా చాలకాలంవరకూ చూడలేదు. ఈలోపు అతను తుమ్మకర్రను తెచ్చిపెట్టుకొన్నాడు.

కావేటి తన తడికల మేడలోనే ప్రసవించింది. అప్పుడు మరోసారనుకుంది. తను భదిరియ్య పెళ్ళాన్నికానని– పాలేరు కోటయ్య పెళ్ళాన్నని. కోటయ్య అప్పటి వరకూ ఇంకా రక్తమాంసాలనే ప్రేమిస్తున్నాడు. కాని ఈకాన్పు తర్వాత ఆ రక్త మాంసాల వెనుకనున్న కావేటంటే విపరీతమైన అనురాగం చూపేవాడు.

కొడుక్కి భదిరియ్యగారిపేరు పెడతానన్నాడు. చిన్నప్పటినుండి వాళ్ళపనిలోనే చేశానన్నాడు. కావేటి ససేమిరా ఒప్పుకోలేదు.

అలాగయితే "నీపేరు పెట్టు" అని పంతంపట్టి కాంవయ్య అని పెట్టించాడు. ఓరోజు కావేటి చాపమీద పడుకొని పిల్లాడికి పాలిస్తోంది. కోటయ్య కొడుకు పక్కనే పడుకొని కావేటిని చూస్తూ అన్నాడు.

"కాంవీ, నువ్వు నాకోసంవే పుట్టావుకదూ!"

"లేదు. నువ్వే నాకోసం పుట్టావు" కావేటి సమాధానం.

"పోనీలేయే మన బుడ్డోడికోసం మనిద్దరం పుట్టాం" అన్నాడు నవ్వుతూ కోటయ్య.

కావేటి చేత్తో జుట్టు సవరించుకొంటూ అంది.

"మాంవా! మన కాంవయ్యను చదివించాలి. ఇప్పట్నుంచీ కూడబెట్టాలి. వేణ్నీళ్లకు సన్నీళ్ళు సాయంవంటారు. నేనుకూడ రేపట్నుంచి కూలికొస్తా"నంది. కోటయ్య కాలుస్తున్న బీడీ నేలకేసికొట్టి "ఛ! ఆయెదవల కళ్లన్నీ నీమీదేవుంటాయే. ఈల్లేదు" అన్నాడు.

కాని కావేటికి ఇంటిదగ్గర పనిలేకుండా ఉంటే ఏతుంగభద్రయ్య మంచాలో గుర్తొస్తాయని భయం. పైగా కొడుకుని చదివించాలి. అలాటిల్లు కట్టించాలి. ఏదే

1032

వైతేనేం. కోటయ్యను బలవంతానొప్పించేసింది. కోటయ్య చివరికొక షరతుకొప్పుకు న్నాడు ఆ షరతుప్రకారం 'కావేటి కొడుక్కి పాలిచ్చి నిద్రపోబెట్టి, తర్వాత కూలి కెళ్తుంది'.

కావేటి పదిరోజులు కూలికెళ్లింది. పదిరూపాయలు ముంతలోదాచింది. పదకొండో రోజు పిల్లోడిని చీరతోకట్టిన ఉయ్యాలలో పడుకోబెడుదామనుకుంది. కాని చాపమీద నిద్రపోతున్న చిన్నకోటయ్యను కదపబుద్ధికాలేదు. తడికతలుపుదగ్గరేసి కూలికెళ్లింది.

తిరిగి వచ్చేసరికి చాపమీద పిల్లోడులేడు. గాలికి తడికతలుపు కదుల్తూ ఉంది. దూళ్లసాలంతా కంగారుగా తిరిగి ఉలవలదాలిదగ్గర కొచ్చింది. కెవ్వుమని అరిచింది. చుట్టుపక్కలవాళ్ళు పరుగెత్తుకొచ్చారు.

దాలిలోపడి మాడిపోయిన కొడుకునిచూసి కోటయ్య గుండెలవిసేటట్టు ఏడ్చాడు.

"అయినా పాకటం వొచ్చిన కుర్రాణ్ణి అలా పడుకోబెట్టిపోవటం వేటి'' అంది పక్కసాలలో పుల్లయ్య పెళ్లాం. మొత్తంమీద అంతా 'రామరామ' అన్నారు. కావేటీ కోటయ్యా బెంగతో నాలుగురోజులు సరిగ్గా కూడుతిన్లేదు. గుర్తుకొచ్చినప్పుడల్లా నోటిలో గుడ్డ కుక్కుకొని కుళ్ళికుళ్ళి ఏడ్చేవారు.

అదంతా ఓ కలలా జరిగిపోయింది. కోటయ్య కొడుకు చావునుగూర్చి అంతా మర్చిపోయారు.

"పోనీలేయే! మనకు మాత్రం వయసేం మీరిపోయిందా? ఇక పిల్లలు పుట్టక పోతారా" అన్నాడు కోటయ్య పైకండువాతో కళ్లతుడుచుకొంటూ.

కాలం విచిత్రమైంది. ఎవరినీ ఎల్లకాలం ఏడుస్తూ కూర్చోనీయదు. అలాగే ఎవరినీ ఎల్లకాలం నవ్వనీయదు. కాని కావేటి జీవితంలో నవ్వుకంటె దుఃఖమేఎక్కువ ఒలకబోసింది. అలాగని కావేటి అప్పుడప్పుడూ నవ్వటం మానలేదు.

మళ్లా మామూలే,

తుంగభద్రయ్య అప్పుడప్పుడు చిరుతిండి తింటున్నాడు. అయితే కావేటికి తుంగభద్రయ్యమీద మోజుపోయింది. కాని యంత్రంలా ఎప్పటిపనులు అప్పుడు జరిగి పోతున్నాయి. కావేటిలో హుషారు చచ్చిపోయింది. లోకం అర్థమయింది. మళ్ళా

ప్రసవించింది. ఏకీళ్ళూపనిచేయని ఓపిల్ల పుట్టింది. కాని తుంగభద్రయ్య కన్నీరుపెట్ట లేదు. కోటయ్య మాత్రం కుళ్ళికుళ్ళి ఏడ్చాడు. కావేటికి మరోసారి తెలిసింది తుంగ భద్రయ్య పట్టెమంచంకంటె కోటయ్యగుండె చాల విశాలమైనదని. కాలం గడుస్తోంది.

కావేటికి కొంచెం కొంచెం యవ్వనం సడుల్తోంది. కోటయ్య వొళ్లు ఇంకా గట్టిగానే ఉంది. తుంగ భద్రయ్య కమతంలో ముప్ఫైఏళ్లు సర్వీసు పూర్తయింది. ఉంటున్న పాక మారలేదు. కట్టుకొంటున్న గుడ్డ మారలేదు, "ప్రమోషను"మాత్రిం రాకపోలేదు. అదే— పెద్ద పనిలోంచి అంటే పొలంపనిలోంచి తుమ్మక్క మేడలో దూళ్ళను చూసుకోవటంలోకి మారింది— ఆ నోరులేని జంతువులపై ఈ నోరులేని కోటయ్య అధికారి.

కోటయ్య ఓరోజు దూళ్ళకు చిట్టుపెట్టి ఆలోచిస్తూ చుట్ట నోట్లో పెట్టాడు. అగ్గి కోసం తిన్నగా తుమ్మక్క వంటచేసుకొనే పొయ్యిదగ్గరకు వెళ్లాడు. పొయ్యిలో చుట్ట పెట్టి వెలిగించాడు అంతలో తుమ్మక్క పెరట్లోంచి స్నానంచేసి తుండు చుట్టబెట్టు కొని వస్తోంది తుమ్మక్క కోటయ్య వంక ఆదోలా చూసింది. కోటయ్య పొగ వొదుల్తూ కీళ్ళులేని కూతురుగురించి ఆలోచిస్తున్నాడు తుమ్మక్క చీరకట్టుకుంటోంది. కోటయ్య చుట్ట గుప్పుకుంటూ వెళ్ళి వీధితలుపు తీశాడు.

ఎదురుగుండా తుంగ భద్రియ్య గుమ్మంలో చెప్పులిడుస్తున్నాడు. లోపల తుమ్మక్క చీరకట్టుకుంటోంది. "అక్కడ దూడలు ముట్టెలతో చిట్టుతగలేస్తుంటే ఇక్కడేం చేస్తున్నావ్" అన్నాడు రుసరుసలాడుతూ.

"ఎలిపోతనా బాబూ— చుట్టకాల్చుకొంటానికొచ్చా" అడుగు గుమ్మంబైటపెట్టాడు. కంగారులో తుంగ భద్రయ్య విడిచిన చెప్పులు తొక్కాడు.

"యెదవా ! కళ్లు కవిపించటంలేదా? ఏరా"— అంటూ మెడమీద చెయ్యేసి ఒక్క తోపుతోసాడు. కోటయ్య గుండె కలుక్కుమంది. ముప్ఫైఏళ్లగానుగెద్దును ములుకర్రతో పొడిచినట్టయింది. ఆరోజునుండి తుంగభద్రయ్య ఏదోవంకమీద కోటయ్యపై విరుచుకు పడుతున్నాడు— గానుగెద్దుకు ఓపికపోతూంది. ఓరోజు గానుగెద్దును కొట్టటంకూడ జరిగింది. గానుగెద్దుకు ఓపికపోయింది. కమతానికి లెక్కలు చూడమన్నాడు. ఇంకో కమతంలో చేరతానన్నాడు.

1034

"పోతే– పో– అయిదు బస్తాలు వాడుకున్నావ్ వాటికి నోటురాసిపో" అన్నాడు. ముప్పైఏళ్ళ సేవకుడు గనుక దయదలచి అప్పుడే కక్కమనలేదు ఆ అయిదుబస్తాలు. కోటయ్య ఎక్కడికి పోతాడు? ఆ అయిదు బస్తాలు ఏకసంవత్సరంలోనైనా ముందుగా తీసికొని తినకపోతే జీవితం జరగదు– పైగా ఈ కంవత్సరంలో తనకో ప్రత్యేకస్థానం వుంది. పలుగెక్కడో పారెక్కడో తాడెక్కడో– ఏది కావాలన్నా బయటవాళ్ల కోటయ్య దగ్గరకు రావాల్సిందే. ఇదే బావుందనుకున్నాడు. మర్నాడు మామూలుగా పనిలోకెళ్ళిపోయాడు.

ఈమధ్యన కోటయ్యకొక చిన్న 'ట్రాన్సఫర్' వచ్చింది. తుమ్మక్క మేడనుంచి తుంగ భద్రియ్య కొడుకు కంట్రాక్టుపనిలోకి.

ఈ కంట్రాక్టు పనిలోకొచ్చిం తర్వాత కోటయ్య చాలా చిరాగ్గామారిపోయాడు. దానిక్కారణం తుంగ భద్రయ్య కొడుకు. అతనంటే కోటయ్యకు వొళ్లమంట– తను చిన్నప్పుడు వొంటిమీద మోసినప్పటికీ, కోటయ్య కోపానికి కారణం ముఖ్యంగా ఈమధ్య జరిగిన సంఘటన.

కావేటి ఓరోజు కాలవగట్టువెంబడి వస్తుంటే పెర్లిన్‌చొక్కలోంచి పదిరూపాయలు తీసిచూపించి కన్నుకొట్టాడట కావేటి తలొంచుకొని ఇంటికొచ్చి ఏడ్చింది. భద్రియ్య ఒకటి రెండుసార్లు కోటయ్యకిమ్మని డబ్బిస్తే కోటయ్యదాకా చేరలేదు. ఈమధ్యన భద్రియ్య కొడుకు గుఱ్ఱపు బండిమీద తిరుగుతున్నాడు. మొన్న ఆమధ్య ఊరి చివర అప్పలస్వామి చెల్లెల్ని బలవంతాన బండిలోవేసుకొని ఇంకో యిద్దరు కుర్రాళ్లతో పట్నానికి పోయాడట. ఎప్పుడూ కుర్రగేంగితో పేకలాడుతుంటాడు. ఈమధ్యన తాగుతున్నట్టుకూడా వినికిడి, భద్రియ్య కొంతకాకపోతే కొంతన్నా పని చేస్తాడు. అందుకే భద్రయ్య కొడుకంటే కోటయ్యకొళ్లు మంట,

కొడుక్కి పెళ్లవదేమోనని జడిసి సుపుత్రుడిపేర కాంట్రాక్టుచేస్తున్నాడు, అంతే, ఆ దెబ్బతో తుంగభద్రయ్య కొడుకు ప్రయోజకుడయ్యాడన్నారు, కనీసం ప్రయోజకుడిగా కొంచెం నటించమని తుంగభద్రయ్య పెళ్లాం కొడుకును వేడుకొంది. ఏదైతేనేం, దేవుడు వరమిచ్చాడు. తుంగభద్రియ్యకు రెండులక్షల రూపాయలతో కోడలుదిగింది. కోడలనుకుందో లేదో తెలీదుకాని కోడలు తలిదండ్రులనుకున్నారు,

1035

"దానికేముంది— ఇవ్వాళ అల్లరిగా తిరిగినోళ్లు రేపు బాగుపడ్డంలేదా ? కుర్రచేష్టలెల్లకాలం ఉంటాయా— అయినా లక్ష్మి కళకళలాడుతున్న ఇంట్లోకి పిల్ల అడుగిడుతున్నప్పుడు తటిమ్మావనవసరం" ఈ నిర్ణయానికి రాకపోతే కూతురునెలా ఇస్తారు ।

"డబ్బిచ్చి మొగుడ్ని కొనుక్కోవచ్చుగాని ప్రేమను కొనుక్కోలేం" అంటాయి తుంగభద్రియ్య కోడలి కొంగులో అరిన కన్నీళ్ళు.

ఏదైతేనేం. భద్రయ్య కొడుకంటే కోటయ్యకు పరమ అసహ్యం.

కంటాక్టుపనిలో రాళ్లు సర్దుతున్న కోటయ్యకు పిలుపువచ్చింది. అప్పుడప్పుడూ అలవాటులో ఉన్న కోటయ్య ఆరోజు కొంచెం అలవాటులోవున్నాడు. తూలిపడిపోయేటంత అలవాటులో మాత్రం లేడు.

చినదొరగారు పిలుస్తున్నారనేసరికి కోటయ్య చిరాగ్గావెళ్ళాడు. లోపల భద్రయ్య కొడుకొక్కడూ కూర్చొన్నాడు. లోపలేం జరిగిందో ఎవరికీతెలీదు.

కోటయ్య చింతనిప్పులు కక్కుతూ బయటకొచ్చాడు.

"నాయాలి కావాలిరా ? నీయాలి...." అంటూ అరుస్తున్నాడు. అంతా పనులు మానేసి కోటయ్యచుట్టూ మూగారు. కోటయ్య పరిస్థితి కనిపెట్టి 'పోనీలే ఇంటికి పో' అంటున్నారు. ఇంతలో తుంగ భద్రియ్య వొచ్చాడు. లోపలికెళ్ళి గోబ తిరిగిపడ్డ కొడుకుని చూసాడు.

ఒళ్లు తెలియకుండా "ఆ యెదవని కట్టేయండి" అంటూ బైటకొచ్చాడు.

భద్రియ్య పెళ్ళాన్నీ, కోడల్నీ కలిపి బూతులు తిడుతున్న కోటయ్యని అక్కడ పక్కనున్న వొంతెనకు కట్టేశారు.

"పెద్దా సిన్నాలేదా— పాలోసి పెంచితే ఇషం అవుతావురా" అంటూ, కాలి బూటుతీసి కట్టేసిన కోటయ్యను ఒక్కటి కొట్టాడు. తిట్లు తిడుతున్న కోటయ్యదవడలో నాడాదిగింది. పళ్ళమ్మట రక్తంకారింది (అయినా పాలుతాగలేదుగా. విషం కారటానికి అందుకే రక్తం కారింది).

"భవిష్యత్తులో మీరెవ్వరూ క్రమశిక్షణ తప్పకూడదు" అన్నట్టుగా- ఒక్కసారి భద్రియ్య పాలేళ్లందరి పంకాచూసాడు.

1036

తిరిగి కసి ఆగక బూటుతో కోటయ్య తలమీద కొట్టబోయాడు.

అంతే గానుగెద్దు రెండుకాళ్లు ఎగిరి భద్రయ్య గుండెల్ని తన్నినాయ్— తుంగభద్రయ్య ఆ ఊపుకు వెనక్కు పడ్డాడు గబాగబా అయ్యగార్ని ఇద్దరు మనుషులు లేవదీసారు. మరో ఇద్దరు కోటయ్యను చెరోతన్నూ తన్నారు. కాళ్ళూచేతులూ విరగదీసికట్టి రోడ్డుమీద పడేశారు.

కట్టేసిన కోటయ్యను కొట్టడానికి తుంగభద్రయ్య చేతిలో రెండు కంవిసీకర్రలు విరిగిపోయాయి.

ఈ విషయం తెలిసి కావేటి లబోదిబోమంటూ పరుగెత్తుకొచ్చింది.

ఇంతలో భద్రయ్య కొడుకుతేరుకున్నాడు. బ్రతుకు వాఙ్మూలమిచ్చాడు. ''కోటయ్యను ఇంటినుండి కాఫీ తెప్పించటానికి రమ్మన్నాను. పదిరూపాయ లడిగాడు— నిషాలో కావేటి దగ్గరకోసారెళ్ళమన్నాడు. కోపంవొచ్చి నేను చెయ్యిచేసుకొన్నాను. దాంతో నన్ను లెంపమీదకొట్టాడు. కళ్లుతిరిగాయి. ఆ తర్వాత నాకుతెలీదు'' అన్నాడు. ఈమాట చాలమందికి పైకి నచ్చింది. భద్రయ్య బంధువులు, ఊళ్ళో మిగతా పెద్దవాళ్ళంతా కోటయ్య తిరగబడటం మోతుబరు రైతులందరిపై తిరుగుబాటుగా భావించారు. తక్షణం ఊరు ఖాళీచేయాలని ఆర్డరు జారీచేశారు.

పని మనుషులకు పొగరెక్కిందన్నారు. ఇవ్వాళవాడు రేపొద్దుటింకొకడు. ఇలాగే అవుతుందన్నారు.

పాలేళ్ళ తరపున ఓపెద్దొచ్చి అయ్యలందర్నీ బ్రతిమాలుకొన్నాడు. "ఏదోపొరపాటయింది బాబూ! రేపు స్పృహరాగానే క్షమాపణ చెప్పుకుంటాడు" అన్నాడు.

క్షమాపణ చెప్పుకోటానికి కోటయ్య ఇంకా సరిగా మనుషుల్లోకి రావటంలేదు. వొచ్చినా మాట్లాడటంలేదు. ఏదో వెర్రిగా చూస్తాడు. కావేటి బలవంతాన పట్టిస్తే కాస్త గంజితాగుతాడు. జ్వరం ఉందోలేదో చెప్పటానికి కావేటి చేతులు తప్పితే డాక్టరు థర్మామీటరులేదు. ఏదో కావేటి మొత్తుకుంటే మొదటి రెండురోజులూ వచ్చిచూసి వెళ్లాడు. తర్వాత ''అదే పోతుందిలే— ఫర్వాలేద''ని ఊళ్ళో రిపోర్టిచ్చి పోయాడు.

పదిహేను రోజులు గడిచింది. ఈ సంఘటన పాతబడిపోయింది. కాని దూళ్ళపాకలో అప్పుడే ఎలా పాతబడుతుంది. కోటయ్య మూలుగులు తగ్గాలి. కోటయ్య

1037

జ్వరం తగ్గాలి— అప్పుడేవన్నా పాతపడుతుందేమో। అయినా ఇంత గొడవ జరిగిన తర్వాత తుంగభద్రియ్య కావేటి పాకకెందుకొస్తాడు।

అందుకనే తార్పుడు సుబ్బడిచేత కవురంపించాడు. ఎప్పుడూ ఇవ్వనిది ఈసారి ఇరవై రూపాయలు కూడ ఇచ్చి పంపించాడు.

"ఎలా ఉన్నాడే ఈడు" అంటూ వచ్చాడు సుబ్బడు డబ్బుతో. కీళ్లలేనిపిల్ల వెర్రిగా చూస్తోంది. కోటయ్య మూలుగుతున్నాడు. కావేటి దూరంగా గోడకి జారగిల బడి శూన్యంలోకి చూస్తోంది.

సుబ్బడు లోపలికెళ్లి కోటయ్య నుదుటిమీదచెయ్యిపెట్టి పలకరించాడు. మూలుగు సమాధానం.

"ఇయ్యేల మనలో లేనట్టున్నాడు" అంటూ పెదవి విరిచాడు. కావేటి శూన్యం లోంచి కదల్లేదు.

"అయినా ఈ యెదవ అదేంపనేహ్— ఆ పెద్దోళ్ళతో మనకెందుకు సెప్పు— అయినామతిమండమడ— మరిసిపోయానే. అయ్యగారు మందులకని పదియేనిచ్చారు" డబ్బందివ్వబోయాడు.

కావేటిలో చలనంలేదు. "అయ్యిన దానికేడ్చేం సుఖంసెప్పు, బాదపడక" అంటూ పదిరూపాయల కాగితంలో ఐదురూపాయలుపెట్టి గడపమీదపెట్టాడు. కావేటి వాటిని చూడటంలేదు.

"అయ్యగారక్కడ పాకదగ్గరున్నారు. ఏఁవైనా నువ్వు కనిపిత్తే మందులేఁవైనా ఇత్తారు" తార్పుడు సుబ్బడు చెప్పుకుపోతున్నాడు

కావేటి నిర్లిప్తతగా కూర్చుంది.

సుబ్బడు కొంచెం జంకాడు. "నిన్నక్కడికి తప్పకుండ రమ్మన్నాడు దొర. తర్వాత నీయిట్టం" అని నెమ్మదిగా గొణుక్కుంటూ పోయాడు.

కావేటి పాకలోకి వెళ్ళింది. తుంగభద్రియ్య కెదురుగా ఏదోశవం నిలబడినట్లుంది. ఉలిక్కిపడిచూశాడు. కావేటి- గుడ్లప్పగించి చూస్తోంది. రెప్పవాల్చటంలేదు.

"ఇలా అవుతుందని అనుకోలేదు" అంటూ ఏదో చెప్పబోతూ కావేటి వంక చూశాడు చలనంలేదు. అలాగే చూస్తోంది. కొయ్యబొమ్మలాగ. శ్వాసపీలుస్తున్నట్టు

1038

కూడ అనిపించటంలేదు. భద్రియ్యకు ముచ్చెమటలు పోశాయి. కొంచెం కదిపి చూశాడు. కాని కావేటి చూపులు శూన్యంలోంచి కదల్లేదు. మెల్లిగా పాకలోంచి జారుకున్నాడు

ఇది జరిగి ఇరవైరోజులయింది. ఈలోపు ఊళ్లో పెద్దమార్పులేఁవీఁ లేవుగాని కరణంగారి మరణజాబితాలో కోటయ్యపేరు చేరింది. ఊళ్ళో కుర్రాళ్ళు ఆడుకుంటాని కొక పిచ్చిది దొరికింది.

పాపం !— కావేటి— పిచ్చిముండ— అని ముత్తైదువులు ముద్దలేస్తారు. వాటిని కావేటి పక్కనున్న కుక్కకు పారేస్తుంది. ఆ కుక్క తింటుంటే మెతుకులేరుకు తింటుంది. అంచేతే ఆ కుక్కెప్పుడూ ఊరంతా తనతోపాటు తిరుగుతుంది. లోతుకు పోయిన కళ్ళవంక ఎవరన్నా చూస్తే గట్టిగా ఓ అరుపులాటి నవ్వు నవ్వుతుంది.

ఎవరైనా ఏపాతచీరన్నా ఇస్తే పుచ్చుకోదు. తన చీరెలో ఓ కొంచెం ముక్క చింపి ఎదురిస్తుంది.

రాత్రి పన్నెండు, ఒంటిగంటకు ఊరి చివరి తాడిచెట్లదగ్గరికెళ్ళి "మాఁవో ! మాఁవో !" అని శూనిరాగాలు తీస్తుంది,

నవ్వుతుంది, ఏడుస్తుంది, నవ్వుతూ ఏడుస్తూ పిల్లల్ని నవ్విస్తుంది. పిల్లలు మొరమొరాలు పెడితే తింటుంది. కణికముక్కలు కొరికి ఊస్తుంది. జుట్టు పీక్కుంటుంది— ఇవేవీచేసినా చేయకపోయినా భద్రియ్య ఇంటిముందు వాటేసుక్కూర్చుంటుంది— ఎవ్వరూ లోపలికెళ్లనివ్వరు. ఎవళ్ళన్నా పెద్దవాళ్ళు అరుగుమీద కూర్చుంటే వాళ్ళ ముందు ఉపన్యాసమిస్తుంది. డబ్బులడుగుతుంది. ఇస్తే మొహాన్నేసి కొడుతుంది.

ఓరోజు తుంగభద్రయ్య అరుగుమీద వీధిగుమ్మం దగ్గరెవ్వరూలేరు. మధ్యాన్నం ఒంటిగంటయింది. భద్రయ్య కొడుకు భద్రయ్యగదిలో మంచంమీద నిద్రపోతున్నాడు తిన్నగా- పిచ్చిది లోపలికెళ్ళింది. భద్రయ్య కొడుకుపక్కని పడుకుంది. వికటంగా నవ్వుతూ, గట్టిగా అరవటం మొదలెట్టింది.

"అహ్హా హ్హా— నేను భద్రయ్యపెళ్లాన్ని నేను భద్రయ్యకోడల్ని" ఈ అరుపుకు భద్రియ్య కొడుకులేచాడు.

ఆడామగా అంతా పరుగెత్తుకొచ్చారు.

1039

పిచ్చిది! పిచ్చిది! కేకలు- పిచ్చిది.

భద్రయ్య కొడుకుమీద పడింది. జుట్టుపీకేసింది. బుగ్గ రక్తంవచ్చేటట్టు గట్టిగా కొరికింది. ఒళ్లు అందినచోటల్లా కొట్టుపెట్టింది. "అహ్హాహ్హా! నేను భద్రయ్యపెళ్లాన్ని. నేను భద్రయ్యకోడల్ని, ఈ మంచాలు నావి. ఈ ఇల్లునాది–' అరుపులు. "పిచ్చిది పిచ్చిది" ఈ గందరగోళంలో పిచ్చిదానికూడా వచ్చిన కుక్క వీధిలోకి జారుకుంది. హాలోహాలోమని కేకలు.

నలుగురు మనుషులు పిచ్చిదాన్ని మంచంమీద నుంచి లాగబోయారు. మంచం మూల గట్టిగా పట్టుకుంది. అది విరిగింది. బలవంతాన తీసుకొచ్చి వీధిలో గిరాటేశారు. "అమ్మో!" అంది.

అంతా తలోమాట అంటున్నారు. "ఇన్నాళ్లూ ఏదో పిచ్చిది, దానిమానాన్న అది బతుకుతుందనుకున్నాం" "కాని ఇలాటి దౌర్జన్యాలైతే ప్రమాదఁవే. ఊళ్ళోవాళ్ళెవరూ కాపరాలుచేసుకో అక్కర్లేదు".

ఇంతలో తేరుకున్న భద్రయ్య కొడుకు లోపలనుంచి తారాజువ్వలా దూసుకొచ్చాడు. జువ్వకర్ర తీసికొచ్చి ఎండి అట్టకట్టిన పిచ్చిదాని నెత్తిమీద ఒక్కవేటు వేశాడు. తలరెండుగా విచ్చింది. ఒళ్లంతా కుంకుమరంగు జల్లింది. రెండుచెవులమీంచి కండకండలుగా, హృదయం ఉన్నాళ్లని కరిగించేదిగా ఏదో ఎర్రగా పడుతోంది

అంతలో అంతా భద్రయ్యకొడుకుని పట్టుకొని చెడామడాతిట్టటం మొదలెట్టారు.

"పిచ్చిముండ, దానికేంతెలుసు" ననొకతను, కొంచెం తెగించి "నువ్వూ నీబాబూచేసిన నిర్వాకమే" నని ఇంకొకతను. సూటిపోటుగా పొడుస్తున్నారు.

మెలికలు తిరిగి నేలనుకూలిన కావేటి దాహం అన్నట్టుగా నోరుదాచింది. ఎదురుగా నిలబడ్డ ఒక చిన్నబాబువంక అలా చూస్తోంది– తలలోంచి రక్తం కావేటిని వొదులుతోంది– అంతలో ఎవరో ఒక తప్పాలాతో నీళ్లపట్టుకొచ్చి ఆబాబు చేతికిచ్చి పొయ్యమన్నారు. ఆబాబు, నోటిమీద అలా నీళ్లపోస్తున్నాడు. కావేటి రక్తంలోంచి అలా చూస్తోంది. రక్తం నీటితోకలసి అలా రోడ్డుపైసాగుతోంది.

1040